# మాయని పున్నమి

పోష్టుమేన్ అందించిన కవరు చూసి ఎగిరి గంతులేసింది షీలా. ఎన్నాళ్ళ గానో తన మనస్సులో ఉన్న కోరిక ఈ రోజు తీరిపోయింది. తన వ్యాసానికి మొదటి బహుమతి లభించింది. ఈ విషయం శ్రీవారితో సగర్వంగా చెప్పాలి. అప్పుడు అతని కళ్ళల్లో మెరుపు చూడాలి. శ్రీవారి రాకకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

గుమ్మంలోనే స్వాగతం ఇస్తూఉన్న షీలాని చూసి ఆశ్చర్యపోయేడు శ్రీకాంత్. తను ఆఫీసునుంచి వచ్చి పది, పదిహేను నిముషాలైనా అతని రాకని గమనించకుండా ఇరుగుపొరుగువాళ్ళతో కబుర్లలో లీనమయ్యే షీలా ఈరోజు స్వాగతంఇస్తున్నదంటే ఏదోవిశేషమేఉండిఉంటుంది అనుకున్నాడు.

“ఏమండోయ్, శ్రీవారూ! నా వ్యాసానికి మొదటి బహుమతి వచ్చింది....” శ్రీమతి మాట పూర్తికాకుండానే, “కంగ్రాట్యులేషన్స్ షీలా!” అంటూ అభినందించాడు.

“ఇంతకీ నీ వ్యాసం నాకు చూపించనేలేదు. పేరేమిటి?” శ్రీమతి చేతుల్లోని కాఫీ కప్పు అందుకుంటూ అన్నాడు.

షీలా తను రాసిన వ్యాసం పేరు చెప్పేసరికి ఉలిక్కి పడ్డాడు శ్రీకాంత్.

కాస్త సర్దుకొని, "మీ రెవలోయ్ మధ్యలో? ఆ విషయంలో మీ కర్తవ్యం ఏముంది? మీ ఆడవాళ్ళు చేసేదేముంది?" అన్నాడు.

షీలా గల గల నవ్వింది.

"అలా నవ్వకు షీలా! నాకు కోపం వచ్చేస్తుంది మరి."

"మీకు కోపం వస్తే రానియ్యండి. కోపాలకూ, అలకలకూ బెదిరి పోయే ముగ్ధను కాను. మీరన్నారు కానీ, అది నిషేధించడం మా చేతుల్లోనే ఉంది." నవ్వుతూనే అంది షీలా.

"అదెలాగో చెప్పవోయ్ చూద్దాం?"

"అసలు నా వ్యాసం చదివితే మీకే తెలుస్తుంది. మీకు పాఠాలు చెబుతూ కూర్చుంటే వంటింటి పని అయినట్టే" అంటూ బహుమతి గెలుచు కున్న తన వ్యాసం అతనికి అందించింది.

"అయితే నీ రచనకు పాఠకుణ్ణి కాక తప్పదంటావు!" చిరునవ్వుతో షీలా చేతుల్లోని వ్యాసాన్ని అందుకున్నాడు శ్రీకాంత్.

శ్రీకాంత్ చదవడం పూర్తిచేసి ఆలోచనలలో పడ్డాడు. షీలా బాగానే రాసింది. కాదు—చాలా బాగా బహుమతి గెలుచుకొనే అంతగా రాసింది. అయితే షీలాకు ఈ విషయంలో ఇంత పట్టుదల ఉందన్నమాట! చల్లగా సాగిపోతున్న తన సంసారజీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు వస్తాయో? ఎప్పటినుంచో తన మనస్సులో ఉన్న కోరికను ఆ అభిప్రాయంతోనే అణచి వేసుకొన్నాడు. ఈ మధ్య ఒక పార్టీలో స్నేహితులంతా డ్రింకు పుచ్చుకో మరీ బలవంతం చేశారు. ఆ అమృతపానంతో ఒక్కసారి అతీత లోకాలకూ వెళ్ళాలని లోలోన ఉన్నా, ఆ రోజుకు ఎలాగో తప్పించుకున్నాడు. కాని

అతనిలో ఒక్కసారైనా మధువు రుచి చూడాలన్న కోరిక మరింత బలపడి పోయింది ఆనాటి నుంచి. "ఇక ఎలాగైనా మధువు రుచి చూసెయ్యాలి. కోరికలను ఒకరికోసం అణచి ఉంచడం సబబు కాదు" అని తను అనుకుంటున్న సమయంలో షీలా వ్యాసం అతని హృదయాన్ని ఊపి ఊగిసలాడించింది.

"మద్య నిషేధం—మగువల కర్తవ్యం!" ఈ విషయాన్ని గురించి చాలా రాసింది. ఇవన్నీ రాతలలోనే! చేతలలో చేతవుతాయా? ఏదో బహుమతికోసం రాసిందే కాని తన విషయంలో షీలా ఏమి చేయగలదు?

"ఇంతకూ నా వ్యాసం ఎలాగుంది?" షీలా మాటలకు ఆలోచనల నుంచి తేరుకున్నాడు.

"నీ వ్యాసానికి తిరుగేమిటి? బాగులేదని నేననగలనా? బహుమతి గెలుచుకుందిగా!" నవ్వుతూనే అనేశాడు శ్రీకాంత్.

ఆ రోజు రాత్రి "షీలా! నీకో మాట చెప్పనా?" పాపాయికి పాలు పడుతూవున్న షీలాతో అన్నాడు.

భర్త ముఖంలోకి చూసిందిషీలా. ఆ ప్రశ్న ఏదో చిలిపి కోరికను వ్యక్తపరచడంలేదు. అతని ముఖం గంభీరంగానే ఉంది. అతను చెప్పబోయేదేమిటో ఊహించలేక పోలేదు షీలా

"చెప్పండి!" అంది ఎంతో మామూలుగా.

"షీలా! నేను అప్పుడప్పుడు ఫ్రెండ్స్‌తో డ్రింకు తీసుకోవాలనే అనుకుంటున్నాను. ఎందుకో తెలుసా? అది చాలా సహజమైన విషయం. అదోరకం హేబిట్. అంతే! కాని ఎక్కువగా మీ ఆడవాళ్ళు అదేదో చేయరాని పని అనుకుంటూ వుంటారు. అలాంటి భర్తతోకాపురం చేస్తే జీవితం

దుర్భరమని భావిస్తారు. నేటి నవనాగరికత సమాజంలో ఇదొక ఫేషన్ షీలా!"

సమాధానం కోసం షీలా కళ్ళల్లోకి చూసేడు.

"మీరు అలా చూడనక్కరలేదు. మీరు చెప్పే యిలాంటి మాటలతో మారిపోయే చంచలమైన మనస్సు కాదు నాది."

ఆ మాటలకు శ్రీకాంత్ తేలిగ్గా నవ్వేసి, "షీలా! ఇప్పటి వరకూ మన దాంపత్యం మాయని పున్నమితో, హాయిగా అందమైన విపంచిపై పలికే మధుర రాగంలా సాగిపోతోంది. నేను సహధర్మచారిణిగా నిన్ను స్వీకరించినప్పటినుంచీ నీకు అయిష్టత కలిగేలా ఏదీ చేయలేదు. సోషల్‌గా నలుగురితో కలిసి వినోద కాలక్షేపాల్లో, పార్టీల్లో పాల్గొనటం అలవాటు చేసుకుంటాను." అన్నాడు.

"నేను పార్టీలూ, వినోదాలూ వద్దని చెప్పలేదుగా!"

"అదే! ఆ పార్టీలలో అప్పుడప్పుడు డ్రింకు తీసుకుంటాను, అలా అని పెద్ద త్రాగుబోతుగా తయారయి నీకు ఎలాంటి అన్యాయం చెయ్యను సనుకో!"

"నేను నా అభిప్రాయం సూటిగా చెప్పేస్తున్నాను. చిన్న మర్రి విత్తనం మహా వృక్షమై ఊడలతో భూమిలో పాతుకున్నట్టు, ఈ అలవాటు ఇంతింతై కొండంతై కొంపలే గుల్ల చేస్తుంది. ఒక్కసారికూడా మీరాపని చెయ్యడానికి వీల్లేదు." సూటిగా అతని కళ్ళల్లోకి చూస్తూ అంది.

శ్రీకాంత్ ఆ చూపులోని వాడినీ, వేడినీ తట్టుకోలేకపోయాడు. ముఖం ప్రక్కకు త్రిప్పేసుకున్నాడు.

"చూడు — షీలా నువ్వు ఆడదానివి. నా వాంఛలను వారించే హక్కు నీకు లేదు. నిజానికి నీ మీద నాకైతే అధికారం ఉంది. కాని నీకుమాత్రం లేదు. ఈ విషయం మరిచిపోకు."

భర్త మాటకు సహించలేకపోయింది. "ఆ విషవలయాల్లో పడే, అది గుర్తుపెట్టుకునే, వనితాలోకం ఇంత అధోగతికి దిగజారుతోంది—మొగ వారి పెత్తనంతో అడుగునపడి, అధికారాలు, అహంకారాలు కావు దాంపత్య జీవితానికి ప్రధానం—ప్రేమానురాగాలు మాత్రమే. ఏ విషయంలోనైనా పరస్పర అవగాహన లేనప్పుడు ఇదేమీ విడదీయలేని బంధం కాదు."

"ఇంతకూ నువ్వే మంటావు?"

"నేనే కాదు—ఈ నాటి నారీలోకం ఏక కంఠంతో మారు మ్రోగు తోంది—మధువు మత్తులో తేలే భర్తకు భార్యగా జీవించనని."

శ్రీకాంత్ పగలబడి నవ్వాడు. "మొత్తంగా మీ అభిప్రాయం చాలా బాగుంది. షీలా! నువ్వు మహిళామండలి సెక్రటరీవి అయినంతమాత్రాన ఇంత ఎగసిపోనక్కరలేదు. మీరు ఏమన్నా మా అభిప్రాయాలు మావి. నీకు ముందుగా చెప్పనిదే ఏపని చెయ్యడం నాకు నచ్చదు. నీకు చెప్పానంతే! అంతమాత్రాన నీ ఆజ్ఞను పాటించి నువ్వు చెప్పినట్టాల్లా నడుచుకుంటూ నీ దాసుడనై ఉంటాననుకోకు. ఇందులో ఆజ్ఞలు అనుజ్ఞలు లేవు. ఒకరి కొకరు బానిసలుగా ఉండవల్సిన అవసరం లేదు."

"మీ ఆరోగ్యాన్ని, నా అయిదవతనాన్ని, పాప భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెబుతున్నాను. మీరు ఎప్పుడూ మధువు జోలికిపోకండి ఈసారి షీలా భర్తను అనునయించింది. ఆమె గొంతులో కొద్దిగా దైన్యం ధ్వనించింది.

కానీ అవేవీ శ్రీకాంత్ మనస్సును తాకలేదు. "ఏమైనా సరే! నన్ను ఏమనే హక్కు నీకులేదు. కోరికలను అణచి పెట్టుకోవటం నాకు చేతకాదు" రోషంగా అన్నాడు.

"మీలో సగభాగమైన నాకు మీ మంచి చెడ్డలు ఆలోచించే అవకాశాన్ని ఇవ్వలేనప్పుడు, మీతో నా జీవితాన్ని ముడివేసుకొని అమావాస్య చీకట్లలో జీవించలేను. మీరు అటువంటి పనిచేసిన మరుక్షణం మన దారులు వేరైపోక తప్పదు. మనం ఈ లోకానికి తీసుకొని వచ్చిన పసిప్రాణాన్ని పోషించగల సమర్థత నాకు ఉంది" గంభీరంగా అంది షీలా.

తర్వాత వాళ్ళిద్దరిమధ్య మౌనమే రాజ్యం చేసింది. పాపాయిని హృదయానికి హత్తుకొని, వేడి నిట్టూర్పు వదిలి, నిద్రలోకి జారుకుంది షీలా.

పడుకున్నాడన్నమాటే కాని నిద్రరావటం లేదు శ్రీకాంత్‌కు. ఎంత అహంకారం షీలాకు? ఎంత ధైర్యం? తనను ఎంత ఎదురించి మాట్లాడుతోంది? అంతమాత్రానికే వదలిపోతుందట! అన్నదే కాని అలా చెయ్య గలదా? మాటలలో చూపించగలిగిన ధైర్యం చేతలవరకూ వస్తుందా ఏం? అసలు తనే పిరికివాడు అయిపోతున్నాడు. ఆ మాత్రం భార్యను ఎదిరించ లేకపోతే తనేం మొగవాడు? తన విలాసాలకూ, సరదాలకూ షీలా ఏ మాత్రం అవరోధంగా నిలవడానికి వీల్లేదు. ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది శ్రీకాంత్‌కు.

ఎప్పటిలా ఆరోజు ఆఫీసు నుంచి ఇంటికి వెళ్ళదలచుకోలేదు శ్రీకాంత్. తన ఊహల్లో ఇంతవరకూ ఉన్న ఆనందాన్ని చవిచూడాలను

పన్నాడు. అనుకోవడమే కాదు—ఆ ఆనంద లోకాల్లో అర్ధరాత్రి వరకూ తేలిపోయాడు. ఇంటికి వచ్చి షీలాను చూసిన అతనికి అంతా తమాషాగా అనిపించింది. ఏవో పుస్తకాలు చదువుతూ మేలుకొనే ఉంది. అంటే తన కోసం ఎదురుచూస్తూ ఉందన్నమాట! మామూలుగా భోజనం వడ్డించింది. తను తినకపోతే షీలా తినటం మానేసింది. మర్నాడు కూడా నవ్వుతూనే మాట్లాడింది. నిన్న రాత్రి సంఘటన అసలు తన మనస్సులో ఉన్నట్టే లేదు. అయితే ఆఫీసుకు వెళ్ళేటప్పుడు ఒక మాట మాత్రం అంది—

"మీరు ఇలాంటి అలవాట్లు అలవరచుకుంటే మన దారులు వేరైపోతాయి. గుర్తుంచుకోండి."

తను ఆ మాటలు అతి తేలికగా తోసి పారేశాడు. నాలుగు రోజులు అలాగే గడిచింది. రోజూ అతను అర్ధరాత్రివేళ ఇంటికి రావటం, షీలా అతను వచ్చేవరకూ ఎదురుచూస్తూ కూర్చోవడం, తెల్లారేక నవ్వుతూ మామూలుగానే మాట్లాడటం.

తనకు ఈ అలవాటు లేనప్పుడు మద్యం ముట్టుకోవద్దని మరీ మరీ బోధించిన షీలా ఇప్పుడతనికి అవరోధంగా నిలబడలేదు. క్షణక్షణం కలహించడంలేదు. అందుకు నవ్వుకున్నాడు శ్రీకాంత్.

రోజూలాగానే ఆ రోజు తను ఇంటికి వచ్చేసరికి తెరచి ఉన్న తన ఇంటి తలుపు మౌనంగా అతన్ని ఆహ్వానించింది. లోపలకు వచ్చిన శ్రీకాంత్‌ను పలకరించడానికి అక్కడ ప్రాణం వున్న మనుష్యులెవరూ లేరు. ఉయ్యాలతో సహా అన్నీ బోసిగా ఉన్నాయి. ఆశ్చర్యపోయాడు శ్రీకాంత్. అతడికి మత్తు వదలిపోయింది. ఇల్లంతా షీలా కోసం కలయ

చూసాడు. ఆమె తన పట్టుదల నెరవేర్చుకుంది అని తెలుసుకున్న శ్రీకాంత్ నిలువెల్లా కంపించి పోయాడు.

"తనెంత పొరపాటు చేశాడు? మధువు కావాలన్న వాంఛతో షీలాని దూరం చేసుకున్నాడు. జీవిత మాధుర్యం అంతా దగ్ధం చేసుకున్నాడు. చల్లగాసాగే సంసారంలో, ఇల్లాలు అందించే అనురాగ మధువులో, పసి పాప నవ్వులలో–జీవిత మాధుర్యం అంతా కుదించి ఉంది కాని, కాస్సేపు మైకంలో తేల్చి, ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని హరించి నలుగురిలో నవ్వుల పాలుచేసే సురాపానంలో ఏముంది?"

తన తప్పును తను తెలుసుకున్నాడు. "ఈ పొరపాటు ఇక ఎప్పుడూ చేయకూడదు" అనుకున్నాడు. తన సర్వస్వమైన షీలా తనకు దూరమై పోవడానికి వీల్లేదు. అప్రయత్నంగానే "షీలా–షీలా" అని పిచ్చిగా అరిచాడు.

"ఏమైందండీ?" అంటూ శ్రీకాంత్ చుట్టూ చెయ్యి వేసింది షీలా. షీలా చేతులు గట్టిగా పట్టేసుకొని, "నువ్వు ఎక్కడికీ వెళ్ళిపోకు షీలా! నువ్వు దూరమైతే నేను బ్రతకతేను" అన్నాడు.

"ఏమిటండీ! నేనెక్కడికి వెళ్ళిపోయాను ఇప్పుడు? కలగన్నారా?" షీలా మాటకు ఉలిక్కిపడ్డాడు శ్రీకాంత్.

"కలగన్నాను షీలా! స్వప్నంలో వాస్తవాన్ని దర్శించగలిగేను. మాయని పున్నమిలాంటి మన జీవితంలో ఏ అవాంఛనీయమైన వాసనలూ, ఏ అమావాస్య చీకటులూ ముసురుకోక మునుపే నా తప్పు తెలుసుకున్నాను" షీలాని దగ్గరకు తీసుకుంటూ అన్నాడు.

నిండు పున్నమి వెన్నెలలో పులకించిన కలువలా, భర్త సన్నిధిలో పులకించిపోయింది షీలా.

* * *